# ఋణకేతుని కథ



క్రాకరాజా! నీ మాటే కాక వ్యూహమూడా అలా మంచిదికాదు. పరాయి గొడవల్లో కలుగచేసుకోరాదు. సువ్వే చిక్కుల్లో ఇరుక్కుంటావు ఋణకేతుడులా జాగ్రత్త అంది నాగలక్ష్మి వెటకారంగా.

ఎవరా ఋణకేతుడు? అన్నాడు సుబ్బన్న భార్యవంక చూసి.

నాగలక్ష్మి ఆ కథ చెప్పింది.

పూర్వము ఋణవ్రతుడు అనే వాడొకడు ధనస్వామి అనే శ్రేష్ఠిని అప్పడగబోయాడు. ధనస్వామి లేదంటున్నాడు.ఇతను ఇవ్వమంటున్నాడు. దారిని పోయే ఇంధనస్వామి వీరి తగాయిదా చూసి పలకరించి యేమయ్యా మా ఋణస్వామి మహాయోగ్యుడు గదయ్యా, బుద్ధిమంతుడు గదయ్యా ఆతనికి అప్పివ్వడానికి సందేహమేల అన్నాడు నవ్వుతూ. ధనస్వామి కోపగించుకుని నేనలా కళ్ళు మూసుకుని అప్పులివ్వలేను. అంత నమ్మకము ఉంటే నువ్వే ఇవ్వరాదా అన్నాడు. ఓ ఎందుకివ్వనూ అనేశాడు ఇంధనస్వామి కళ్ళు మూసుకునే. అవి తెరవగానే కటుక్కున నాలిక్కరచుకొని, అదీ అప్పుడే ఆ దారిన అమ్మొచ్చిన గంపలో పచ్చి వెలక్కాయా కలిపి మింగేసి గుడ్లు మిటకరించి "చేతనైతే డబ్బు లేదు గాని" అని— సాగదీశాడు.

దానికేముంది నీక్కావాలంటే నేను అప్పిస్తాను. నిన్ను నమ్మగలనుగా అంటూ ధనస్వామి ఇంధనస్వామికి అప్పిచ్చాడు. గత్యంతరంలేక ఇంధనస్వామి దానిని ఋణకేతుడి చేతుల్లో తగలేశాడు. అది ఇంక మళ్ళీ రాదని సలహా ఇచ్చేముందే తనకు తెలుసు. కాబట్టి ఇంటికెళ్తూనే అంగరకా విప్పి భోరున ఓ ఏడుపు ఏడ్చి ఊరుకున్నాడు. కాబట్టి ఓ కాకరాజా

ఖబర్దార్ ! చెట్టుమీంచి నీ గూటికే మోసం రాగలదు అంది నాగలక్ష్మి.

కాకరాజు భార్య కంగారుపడి కావురు బావురని ఏడ్చి నాగలక్ష్మిని బతిమాలుకుంది. నాతల్లి, తల్లిపిల్లలవాళ్ళం, అలాటి పనులు చెయ్యకండి అంది. అని మొగుడి డొక్కలో రెక్కతో పొడిచింది. రెక్కాడితేగాని డొక్కాడనివాళ్ళం. మనకి రభసలేల? నీవుపోయి పిల్లలకి మేత పట్రా తుంటా కాకమ్మ కబుర్లూ నువ్వూనూ అని మందలించింది.

తరవాత ఓ రెండు నిముషాలసేపు నిశ్శబ్దం గంభీరంగా ఉపన్య సించింది.

ఇంతకీ యేమంటారు? పుట్ట ఖాళీచేస్తారా లేదా అంది నాగలక్ష్మి కర్కశంగా.

చిత్తం తమరిలా అంటే ఎలా. ఖాళీ చెయ్యాలన్నా లక్షలకొద్దీ ఉన్నాం. కాబట్టి వ్యవధి పడుతుంది. ఈలోగా మీరు తొందరపడితే కుట్టి చంపేస్తాం, గాన గ్రహించగలరు అన్నాడు సింహాద్రి.

కాపోయినా, పదికాలాలు మనకి అప్పిస్తే వీళ్ళ పుట్ట మునుగు తుందా. నిజంగానే రేపు వరదలొచ్చి పుట్ట కొట్టుకుపోతే ఏంగాను ఋణ తిలకుడి డబ్బులా అందో కుర్ర చీమ.